వైసీపీ మహిళా జిల్లా అధ్యక్ష పదవికి చింతాడ మంజు రాజీనామా



టెక్కలి, ఆగస్టు 23: వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు రాజీనామా పత్రాలు పంపినట్లు ఆమె విలేకరులకు తెలిపారు. పార్టీలో పరిస్థితులు, వ్యక్తిగత కారణాలు దృష్ట్యా తన పదవికి రాజీనామా చేశానన్నారు. ఇదిలా ఉండగా.. టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కేటాయించలేదనే అసంతృప్తితో చింతాడ మంజు.. తన పదవికి రాజీనామా చేశారని కార్యకర్తల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను గురువారం అధిష్ఠానం తొలగించింది. పేరాడ తిలక్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ పదవిపై ఆశలు పెట్టుకున్న మంజుకు నిరాశ ఎదురవడంతో.. రాజీనామా చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈమె భర్త చింతాడ గణపతిరావు వైసీపీలో క్రియాశీలక రాజకీయాలు నిర్వహించేవారు.

అప్పుడు రెచ్చిపోయాం.. ఇప్పుడెట్లా?



- వైసీపీ జిల్లా నాయకుల అవినీతి అక్రమాలపై కేసులు
- మాజీ సభాపతి మెడకు బిగుస్తున్న డిగ్రీ సర్టిఫికెట్ ఉచ్చు
- 'ఆడుదాం ఆంధ్రా' లో ధర్మాన కృష్ణదాస్‌పై సీఐడీ విచారణ
- ఇంటా.. బయటా గెలవని దువ్వాడతో తలపోటు
- నాడు తాము చేసిన పాపాలను తలచుకుని బెంబేలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

గత ఐదేళ్లు అధికార దర్పంతో గంభీర స్వరంతో.. ఆవేశంతో ప్రతిపక్షాలపై ఊగిపోయిన వారు ఇప్పుడు మౌనం దాల్చారు. ఎప్పుడు ఏ పాత కేసు మెడకు చుట్టుకుంటుందోనన్న దిగులు వారిని వెంటాడుతోంది. తాజా ఘటనలతో వారిలో మరింత వణుకు ఆరంభమైంది. మాజీ శాసన సభాపతి మెడకు నకిలీ సర్టిఫికెట్ ఉచ్చు బిగుస్తోంది. మాజీ ఉపముఖ్యమంత్రి, నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌పై 'ఆడుదాం ఆంధ్రా'లో అవినీతి పాత్రపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఇక జిల్లాలో అత్యంత వివాదాస్పద నాయకుడిగా గుర్తింపు పొందిన దువ్వాడ శ్రీనివాస్.. అటు రచ్చా.. ఇటు ఇంటా గెలవలేకపోయారు. కుటుంబ వ్యవహారాలు రచ్చకెక్కడంతో పార్టీ శ్రేణులు, ప్రజల్లో మరింత చులకన అయ్యారు. టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని కూడా కోల్పోయారు. ఇలా జిల్లాలో వైసీపీ నేతల తీరుతో.. ఆ పార్టీ పరిస్థితి మరింత దిగజారిపోయింది.



● తమ్మినేని మెడకు.. సర్టిఫికెట్ ఉచ్చు

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం.. గత ఐదేళ్లు ఓ వెలుగు వెలిగారు. కీలకమైన స్పీకర్ పదవిలో ఉన్నామనే విషయమే మరిచి.. అధికార దర్పంతో ప్రతిపక్షాలను తీవ్రంగా విమర్శించేవారు. ఈ క్రమంలో సొంతపార్టీ నేతల నుంచి కూడా ఛీత్కారం తెచ్చుకున్నారు. గత నాలుగు సార్లు సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పలు పార్టీల నుంచి పోటీ చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఇంటర్మీడియట్ విద్యార్హతగా చూపించారు. కాగా.. 2019లో వైసీపీలో గెలిచి స్పీకర్ పదవి చేపట్టాక.. లా కోర్సులో చేరి.. తనకుతానుగా మెడకు ఉచ్చు బిగించుకునేలా చేసుకున్నారు. 2018లో డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీకి చెందిన సెంటర్ నుంచి తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌లో డిగ్రీ పరీక్ష రాసి ఉత్తీర్ణుడైనట్లుగా సర్టిఫికెట్ సంపాదించారు. ఈ సర్టిఫికెట్‌తో హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్‌లో ఉన్న మహాత్మాగాంధీ లా కాలేజీలో మూడేళ్ల 'న్యాయశాస్త్రం' కోర్సులో అడ్మిషను పొందారు. తమ్మినేని ఇన్నాళ్లూ ఇంటర్ విద్యార్హత చూపి.. అకస్మాత్తుగా డిగ్రీ పట్టాపొంది.. దీంతోనే 'లా కాలేజీ'లో స్పీకర్ పదవిలో ఉంటూ అడ్మిషన్ పొందడంపై టీడీపీ నాయకులు దృష్టి సారించారు. తెలంగాణలో టీడీపీ నాయకుడు నర్సిరెడ్డి.. సమాచార హక్కుచట్టం ద్వారా తమ్మినేని సమర్పించిన సర్టిఫికెట్స్‌ను వెలుగులోకి తీయించారు. అందులో తమ్మినేని డిగ్రీ సర్టిఫికెట్ నకిలీదన్న విషయాన్ని బయటపెట్టారు. దీంతో ఇక్కడి ఆమదాలవలస ప్రస్తుత ఎమ్మెల్యే, తమ్మినేని మేనల్లుడు కూన రవికుమార్.. తమ్మినేని డిగ్రీ భాగోతంపై రాష్ట్రపతితోపాటు.. రాష్ట్ర ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు గతేడాది ఫిర్యాదుచేశారు. అప్పుడు ప్రభుత్వం వైసీపీది కావడంతో దీనిపై చర్యలు లేవు. తమ్మినేని డిగ్రీ సర్టిఫికెట్‌పై విచారణ జరపాలని ఆదేశిస్తున్నామని వెల్లడిస్తూ రాష్ట్రపతి నుంచి కూన రవికుమార్‌కు రశీదు అందింది. దీంతో ఇప్పుడు కూన రవికుమార్.. తమ్మినేని డిగ్రీ సర్టిఫికెట్ వ్యవహారంపై సీఐడీతో దర్యాప్తు చేయాలని రెండురోజుల కిందట నేరుగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేసి ఆధారాలను సమర్పించారు. ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా.. తమ్మినేని సమర్పించిన డిగ్రీ సర్టిఫికెట్ తీగ కదలడం ఖాయం. తమ్మినేని మెడకు మరింత ఉచ్చు బిగుసుకోవడం తథ్యం. సభాపతి స్థానంలో ఉంటూ.. లాకోర్సులో ఏరికోరి చేరి.. ఇప్పుడు బయటకు కక్కలేక.. అసలు విషయం వెల్లడించుకోలేక తమ్మినేని మౌనం దాల్చారు.



● 'ఆడుదాం ఆంధ్రా'లో కృష్ణదాస్ పాత్రపై విచారణ

పర్యాటకశాఖ మాజీమంత్రి ఆర్కే. రోజా ఆధ్వర్యంలో గతంలో 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అధికారిక కార్యక్రమాలు నిర్వహించారు. యువతను పరోక్షంగా ఆకట్టుకునేలా వైసీపీ చేపట్టిన ఈ కార్యక్రమం లక్ష్యం తప్పింది. అయితే ఇందులో నిధులు మాత్రం రూ.కోట్లలో గోల్‌మాల్ అయ్యాయి. గత ప్రభుత్వంలో రెండున్నరేళ్ల ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన ధర్మాన కృష్ణదాస్.. తర్వాత పదవి తొలగించడంతో నరసన్నపేట ఎమ్మెల్యేగా ఉండిపోయారు.

అయితే 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో ధర్మాన కృష్ణదాస్.. అప్పటి మంత్రి ఆర్కే. రోజాతో కలిసి అక్రమాలకు పాల్పడ్డారని.. నిధులు గోల్‌మాల్ చేశారని ఇటీవలే 'ఆత్యా-పాత్యా అసోసియేషన్' రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు చేయాలని, మాజీమంత్రి రోజా, మాజీఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌పై విచారణకు ఆదేశిస్తూ సీఐడీ అడిషనల్ డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఈనెల 7న ఉత్తర్వులను జారీచేశారు. దీంతో 'ఆడుదాం ఆంధ్రా'లో.. తన పాత్ర ఎంతుందన్న విషయమై కూడా స్వయంగా చెప్పుకోలేని స్థితిలో మాజీమంత్రి ధర్మాన కృష్ణదాస్ .. మౌనం దాల్చారు. ఎప్పుడు విచారణ ఆరంభమవుతుందో.. సీఐడీ ఎప్పుడు తలుపు తడుతుందో.. కేసు ఏస్థాయికి చేరుకుంటుందో అని ఆయన టెన్షన్ పడుతున్నారు. ఇదిలా ఉండగా... గతంలో అమరావతి రైతుల విషయంలో బూతు మాటలను ప్రయోగిస్తూ.. అప్పట్లో కృష్ణదాస్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అధికార దర్పంతో వైసీపీలో వ్యతిరేక వర్గాన్ని మూట కట్టుకుంటూ అసమ్మతిని పోగేసుకున్నారు. ఇప్పుడు పార్టీపరంగా ఏ కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నారు.



● ఇంటా.. రచ్చా గెలవని దువ్వాడ

ఇంట గెలిచి రచ్చ గెలవాలని పెద్దలు చెబుతారు. కానీ రచ్చ గెలవలేకపోయిన.. చివరకు ఇంటా గెలవలేకపోయి ఏరికోరి పార్టీపరంగా తనకుతానుగానే డ్యామేజీ చేసుకున్నారు. జిల్లాలో టీడీపీ పెద్దతలకాయ 'కింజరాపు అచ్చెన్నాయుడు'ను ఢీకొట్టేస్తానంటూ జగన్‌ను దువ్వాడ శ్రీనివాస్ నమ్మించారు. ఆపై మరింత నమ్మకం కుదిరేలా చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్‌కల్యాణ్‌పై బూతుపురాణం విదుల్చుతూ.. అచ్చెన్నాయుడుపై తప్పుడు కేసులు పెట్టించే విషయంలో చురుగ్గా వ్యవహరించారు. దీంతో దువ్వాడ శ్రీనుకు జగన్ ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు. 2014లో ఓటమి చవిచూసినా 2019లో ఓడిపోయినా.. మళ్లీ 2024లో కూడాను దువ్వాడను టెక్కలి నుంచి అసెంబ్లీ బరిలో దింపారు. కానీ నోటిదురుసు తనంతో ప్రజల్లో ఆదరణలేకపోవడం.. సొంతకార్యకర్తలు కూడా మొన్నటి ఎన్నికల్లో దువ్వాడను ఘోరంగా ఓడించారు. ఎన్నికల ముందు గోప్యంగా ఉంచిన ఇంటిపోరు.. ఇప్పుడు రచ్చకెక్కింది. భార్య, కుమార్తెలకు దూరంగా ఉంటూ.. మరో మహిళతో కలిసి ఉండటం వల్ల వ్యవహారం రచ్చరచ్చ అయింది. కుమార్తెలు తండ్రి శ్రీనును కలిసేందుకు ఇంటికి వెళ్లినా గేటు తీయలేదు. దీంతో భార్య దువ్వాడ వాణి కూడా నిరసన చేపట్టారు. ఆ తర్వాత ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ దివ్వెల మాధురి ప్రెస్ ముందుకు వచ్చి కొన్ని విషయాలు మాట్లాడారు. ఎమ్మెల్సీ దువ్వాడ కూడా తన భార్యపై ప్రత్యారోపణలు చేస్తూ తన ఇంటిపరువును తానే గొయ్యి తీసుకుని కప్పువేసుకున్నట్లుగా వ్యవహరించారు. గత పదిరోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇదే చర్చ.. రచ్చ. కుటుంబ వ్యవహారాన్ని పరిష్కరించాల్సి కోవాల్సింది పోయి.. పంతాలకు దిగి మరింత బెట్టుచేశారు. ఫలితం.. భార్య, కుమార్తెలు భీష్మించుకుని దువ్వాడ శ్రీను భాగోతాన్ని ఎండగట్టారు. ఇప్పటికే పార్టీకి నష్టం కలిగిందని వైసీపీ అధిష్ఠానం గుర్తించింది. టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి ఎమ్మెల్సీ దువ్వాడను తప్పించింది. ఆ బాధ్యతను పేరాడ తిలక్‌కు అప్పగించింది. దీంతో ఇన్నాళ్లు అధికారంతో ఎగసిపడిన దువ్వాడ.. కింద పడినప్పటికీ.. ఇంకా కళ్లు తెరవలేకపోతున్నారు. దువ్వాడ శ్రీనివాస్ తీరుతో జిల్లాలో వైసీపీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారిపోయింది.

సానివాడను దత్తత తీసుకుంటా

- ఆదర్శంగా అభివృద్ధి చేస్తా
- పల్లెలను రెండేళ్లలో స్వర్ణగ్రామాలుగా మారుస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు



గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 22: 'గ్రామ పంచాయతీలే దేశానికి పట్టుకొమ్మలు. వాటి అభివృద్ధే ధ్యేయంగా గ్రామసభలు నిర్వహిస్తున్నామ'ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలోని 912 పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి.. ఉపాధిహామీ పనుల ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధిపై ప్రజలతో తీర్మానాలు చేయిస్తున్నామని వెల్లడించారు. సీసీ రోడ్లు, కాలువలు నిర్మించి.. పల్లెలను రెండేళ్లలో స్వర్ణ గ్రామాలుగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. శ్రీకాకుళం మండలం సానివాడలో శుక్రవారం సర్పంచ్ రుప్ప లక్ష్మీరమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభకు మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. 'గడిచిన ఐదేళ్లలో గ్రామసభలు తూతూ మంత్రంగానే జరిగాయి. గ్రామాల్లో కనీసం వీధి లైట్లు కూడా లేవు. ఎక్కడ చూసినా చెత్త దర్శనమిచ్చేది. గత వైసీపీ ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేసి.. గ్రామ సంక్షేమాన్ని నిర్వీర్యం చేసింది. ఉపాధిహామీ పనులను కల్పించడంలోనూ విఫలమైంది' అని మంత్రి అచ్చెన్న విమర్శించారు. సానివాడ గ్రామాన్ని దత్తత తీసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

● ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. గ్రామసభల్లో వచ్చే సమస్యలను నమోదు చేసి.. వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించేలా ఈ సభలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ ఎస్.వి.చిట్టిరాజు, ఎంపీటీసీ రుప్ప అప్పలసూరి, తహసీల్దార్ గణపతిరావు పాల్గొన్నారు.

● 'వైసీపీ హయాంలో 2021 జూన్‌లో నాపై ఎస్సీ, ఎస్టీ తప్పుడు కేసులు పెట్టారు. టీడీపీ కార్యకర్తలను ఎంతో వేధించారు. 8వ వార్డు మెంబర్ రుప్ప నర్సుంనాయుడు, గొండు ఆదిత్య, కొర్ను రాంబాబుపై తప్పుడు కేసులు బనాయించారు. వారి సెల్‌ఫోన్లను 2022 ఏప్రిల్‌లో స్వాధీనం చేసుకున్నారు' అని సానివాడ సర్పంచ్ రుప్ప లక్ష్మీ భర్త రమణమూర్తి అచ్చెన్నకు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ బాధితులకు వెంటనే స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు అప్పగించాలని శ్రీకాకుళం సీఐ పైడపునాయుడుకు ఆదేశించారు.

● సానివాడ గ్రామానికి శ్రీపురం పేరు పెట్టాలని జడ్పీటీసీ(వైసీపీ) రుప్ప దివ్య మంత్రి అచ్చెన్న దృష్టికి తీసుకెళ్లారు. కాగా.. గత ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మార్చుకోలేదని అచ్చెన్న ప్రశ్నించారు. ఇది కేంద్రం తీసుకోవాల్సిన నిర్ణయమని ఆమె బదులిచ్చింది. గ్రామ సమస్యలు చెప్పమంటే.. హడావుడి ప్రశ్నలు ఎందుకమ్మా అని అచ్చెన్న పేర్కొన్నారు.



శ్రావణ సందడి

(శ్రీకాకుళం కల్చరల్/ నందిగాం)

శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శ్రీకాకుళం నానుబాలవీధిలోని విజయదుర్గమ్మను విజయలక్ష్మీగా అలంకరించి పూజలు చేశారు. అలాగే నందిగాంలోని నీలమణిదుర్గమ్మను గాజులతో అలంకరించారు. వందలాది మంది భక్తులతో సామూహిక లలితా అష్టోత్తర సహస్ర నామార్చనలు నిర్వహించారు.





ప్రశాంత్ భార్య జ్యోతికి చెక్కును అందిస్తున్న తహసీల్దార్

'అచ్యుతాపురం' బాధిత కుటుంబాలకు పరిహారం

- రూ.కోటి చొప్పున చెక్కుల పంపిణీ



ఆమదాలవలస : ధర్మారావుకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

పొందూరు/ ఆమదాలవలస, ఆగస్టు 23: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మృతుల కుటుంబానికి రూ.కోటి చొప్పున పరిహారం అందజేయాలని ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం పొందూరుకు చెందిన హంస ప్రశాంత్ కుటుంబానికి తహసీల్దార్ రమేష్.. రూ.కోటి చెక్కును అందజేశారు. ఫార్మాసెజ్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ప్రశాంత్.. పేలుడు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిహారం చెక్కును ప్రశాంత్ భార్య జ్యోతికి అందజేశామని తహసీల్దార్ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్‌వో రేవతిరావు ఉన్నారు.

● అలాగే ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన రాజశేఖర్ కూడా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో ఉద్యోగంలో చేరిన నెలరోజులకే ప్రాణాలు కోల్పోయారు. గురువారం అర్ధరాత్రి దాటాక ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా.. అంత్య క్రియలు నిర్వహించారు. అనంతరం రాజశేఖర్ తండ్రి ధర్మారావుకు.. రూ.కోటి చెక్కును అధికారులు అందజేశారు.

టైర్ పంక్చరై.. డివైడర్ ఎక్కి



నరసన్నపేట మండలంలోని తామరాపల్లి- జడూరు గ్రామాల మధ్య జాతీయ రహదారిపై శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. బొబ్బిలి మండలం కారాడ నుంచి ఇచ్ఛాపురానికి చెరకు లోడుతో వెళ్తున్న వాహనం టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. అదే సమయంలో ముందుభాగంలో రెండు ద్విచక్ర వాహనాలు వెళ్తుండగా వాటిని డ్రైవర్ తప్పించారు. మరో లారీను తప్పించి.. డివైడర్‌పై వాహనం ఎక్కించడంతో ప్రమాదం తప్పింది.

- నరసన్నపేట

రవితేజకు శస్త్ర చికిత్స



హీరో రవితేజ కుడిచేతికి సర్జరీ జరిగింది. చికిత్స చేసిన వైద్యులు ఆయనని ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. 'ఆర్‌టీ75' సినిమా చిత్రీకరణలో రవితేజకు ఇటీవలే స్వల్ప గాయమైంది. ఆ గాయాన్ని లెక్కచేయకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. దాంతో ఆ గాయం మరింత పెద్దదవ్వడంతో డాక్టర్లు సర్జరీ చేశారు. కాగా, 'సామజవరగమన' చిత్రానికి రచయితగా పనిచేసిన భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

మహేశ్ సినిమా పేరు అదేనా?




మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో డా.కె.ఎల్.నారాయణ నిర్మించే చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మహేశ్ పుట్టినరోజున సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వస్తుందని ఆశగా ఎదురు చూసిన ఆయన అభిమానులు ఏదీ రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ సినిమా ఉంటుందన్న సమాచారం తప్ప కొత్త వార్తలేమీ బయటకు రావడం లేదు. సినిమా టీమ్ మాత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో సీరియస్‌గా నిమగ్నమై ఉంది. ఇటువంటి నేపథ్యంలో ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. విజువల్ డెవలప్‌మెంట్ ఆర్టిస్ట్ టీపీ విజయన్ తన ఇన్‌స్టా స్టోరీస్‌లో బంగారు వర్ణంలో ఉన్న గద్ద రెక్కలు ఉంచి మహేశ్ సినిమా టైటిల్ ఇదే అని అర్థం వచ్చేలా పోస్ట్ చేయడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ పెట్టవచ్చు అనే ఊహాగానాలు ఊపందుకొన్నాయి. గతంలో దర్శకుడు రాజమౌళి 'బాహుబలి' తర్వాత తను చేయబోయే ప్రాజెక్ట్ 'గరుడ' అని వెల్లడించారు. ఆ ప్రాజెక్ట్ ఇదే అయి ఉంటుందని, సినిమాకు 'గరుడ' అని పేరు పెడతారని సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. మహేశ్ చిత్రానికి 'గరుడ' టైటిల్ ఖాయమో కాదో అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

సమంతకు ఏమైంది?



సిటాడెల్ వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించనున్నారు సమంత. ఆమె సినిమాలు తగ్గించినా.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. అలానే అప్పుడప్పుడు పలు ఈవెంట్లలో పాల్గొని ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తుంటారు. అయితే ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమానికి సమంత బ్లాక్ డ్రస్సులో వచ్చారు. ఈ సందర్భంగా తీసుకున్న వీడియోను ఆమె అభిమానులతో సోషల్‌మీడియాలో పంచుకున్నారు. ఇక అప్పటి నుంచి అభిమానుల కామెంట్లు మొదలైయ్యాయి. 'సమంతకు ఏమైంది... ఆమె మునుపటిలా ఎందుకు అందంగా కనిపించట్లేదు. బరువు తగ్గినట్లుంది. ముఖంలో ఆనందం కనిపించట్లేదు' అని పలువురు అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు.

అలా కామెంట్ చేసినందుకు చింతిస్తున్నా



హీరో నాని నటించిన తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. 'ఆ వ్యాఖ్యల వల్ల అర్షద్‌కు ఎప్పుడూ రానంత ఫేమ్ వచ్చింది" అని అన్నారు. అయితే ఇప్పుడా మాటలు సోషల్‌మీడియాలో హాట్ టాపిక్కయ్యాయి. ఆ మాటల వల్ల సోషల్‌మీడియాలో అభిమానులు నాని వర్సెస్ అర్షద్ అంటూ రెండు వర్గాలుగా చీలిపోయారు. తాజాగా, 'సరిపోదా శనివారం' ప్రమోషన్స్ కోసం ముంబై వెళ్లిన నాని.. తాను అర్షద్‌పై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. "అర్షద్ చాలా గొప్ప నటుడు. ఆయన గురించి అలా మాట్లాడినందుకు బాధపడుతున్నాను. నటులుగా ఉన్నప్పుడు మాట్లాడే ప్రతీ మాట విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే అవి వైరల్ అయ్యి ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రభాస్‌పై అర్షద్ చేసిన వ్యాఖ్యల్లో.. అర్షద్‌పై నేను చేసిన వ్యాఖ్యల్లో ఆ పొరపాటే జరిగింది. నిజానికి నేను అర్షద్‌ని అలా అనాలనుకోలేదు. నా మాటలు సోషల్‌మీడియా ద్వారా అలా తప్పుదోవ పట్టాయి. నేను ఆయనపై అలా మాట్లాడినందుకు వచ్చిన రియాక్షన్స్‌ను చూసి అర్షద్ పూర్తి ఇంటర్వ్యూ చూశాను. అందులో ఆయన మాట్లాడిన మాటలు తప్పుదోవ పట్టాయని అర్థమైంది. అదే విధంగా నా వ్యాఖ్యలు కూడా మరో రకంగా ప్రజల్లోకి వెళ్లాయి" అని పేర్కొన్నారు.

హేమపై నిషేధాన్ని తొలగించిన 'మా'



నటి హేమ ఊపిరి పీల్చుకున్నారు. ఆమెపై 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) నిషేధాన్ని తొలగించింది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. మేలో జరిగిన ఓ రేవ్ పార్టీలో ఆమె డ్రగ్స్ తీసుకుందని.. పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో నిర్ధారణ కావడంతో ఆమెపై 'మా' సస్పెన్షన్ విధించింది. అయితే ఆమె అందులో నిరపరాధినని పేర్కొంటూ.. ఓ ల్యాబ్‌లో మెడికల్ టెస్టులు చేసుకుని ఆ నివేదికల్ని మంచు విష్ణుకు ఓ లేఖతో పాటు అందించారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన 'మా' ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

సినీటాకు మంచు విష్ణు లేఖ

ప్రభాస్‌పై బాలీవుడ్ అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో తెలిసిందే. ఈ వివాదంపై స్పందిస్తూ.. మంచు విష్ణు 'మా' తరపున 'సినీటా' (సినిమా అండ్ టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్షురాలు పూనమ్ ధిల్లాన్‌కు లేఖ రాశారు. "ప్రతీ ఒక్కరికి నచ్చినట్లు మాట్లాడే స్వేచ్ఛ ఉంది. కానీ ప్రభాస్‌ని కించపరుస్తూ అర్షద్ చేసిన వ్యాఖ్యల వల్ల అభిమానుల మనోభావాలు దెబ్బతిన్నాయి. సినీనటుల ఐక్యత, గౌరవాన్ని కాపాడటంలో ఎల్లప్పుడూ ముందుండే 'సినీటా'.. ఈ వివాదంపై స్పందిస్తుందని ఆశిస్తున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో మరోసారి పునరావృత్తం కాకుండా తగిన సూచనలు అర్షద్‌కు చేస్తారని ఆశిస్తున్నాను. మనమంతా ఒకే కుటుంబం. ఆ ఐక్యతను కొనసాగిద్దాం" అని లేఖలో పేర్కొన్నారు.

'ఎమర్జెన్సీ'ని బ్యాన్ చేయాల్సిందే!

సిక్కుల డిమాండ్



కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం ఇప్పుడు మరో వివాదంలో చిక్కుకుంది. సెప్టెంబర్ 6న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే సిక్కుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా 'ఎమర్జెన్సీ' చిత్రం ఉందనీ, సిక్కులకు వ్యతిరేకంగా రూపుదిద్దుకున్న ఈ సినిమాను వెంటనే బ్యాన్ చేయాలనీ, విడుదల చేయడానికి వీల్లేదని శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) అకల్ తక్త్ డిమాండ్ చేశాయి. ఎస్‌జీపీఎస్ చీఫ్ హర్‌జిందర్ సింగ్ ధామి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కంగనను తీవ్రంగా విమర్శించడమే కాకుండా ఆమెపై కేసు పెట్టాలని కూడా కోరారు. సిక్కులను వ్యతిరేకించే సన్నివేశాలు ఈ మధ్య సినిమాల్లో ఎక్కువ అయ్యాయనీ, అందుకే సెన్సార్‌బోర్డ్‌లో సిక్కులకు కూడా తగినంత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. 'ఎమర్జెన్సీ' చిత్రం తీస్తున్నట్లు 2021లో కంగనా ప్రకటించినప్పటి నుంచీ ఈ సినిమాకు చిక్కులే. ఇందులో ఆమె మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషిస్తూ, దర్శకత్వం వహించారు. ఇది ఇందిరా గాంధీ బయోపిక్ కాదనీ, ఓ పొలిటికల్ డ్రామా అని ఎన్నో సార్లు కంగనా వెల్లడించానా వివాదాలు ఈ సినిమాను వదల్లేదు. ఎన్నో అవరోధాలు తట్టుకుని, విడుదలకు సిద్ధం చేస్తే ఇప్పుడు సిక్కుల నుంచి కంగనాకు ప్రతిఘటన ఎదురైంది.

పెళ్లిపీటలపై మరో హీరోయిన్!



తెలుగు హీరోయిన్లు వరుసగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ పెళ్లి అయిన రోజునే అంటే గురువారం రాత్రే మరో హీరోయిన్ మేఘా ఆకాశ్, ఆమె చిరకాల ప్రియుడు సాయివిష్ణుల నిశ్చితార్థం కేరళలో జరిగింది. తమకు ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయాన్ని గురువారం అర్ధరాత్రి వెల్లడించి, ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది మేఘా ఆకాశ్. పెళ్లి ఎప్పుడన్నది మాత్రం ఆమె పేర్కొనలేదు. సాయివిష్ణు, మేఘా ఆకాశ్ ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నారట.

వర్షాలు లేక.. ఉభాలు సాగక

● ఎండుతున్న వరి ఎదలు ● ఆందోళన చెందుతున్న గిరిజన, ఉద్దాన ప్రాంతాల రైతులు

పలాస రూరల్: పలాస మండలంలో గిరిజన, ఉద్దాన ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన వర్షాలు లేకపోవడంతో ఉభాలు వేయలేదు. దీనికితోడు అక్క డక్కడ ఉన్న ఎదలు సైతం ఎండిపోతున్నాయి. రెండు వారాలుగా చిరుజల్లులు తప్ప సాగుకు ఉపయోగపడే వర్షం కురవడంలేదని రైతులు వాపోతున్నారు. ఆగస్టు మూడోవారం దాటుతున్నా ఖరీఫ్‌లో ఇప్పటివరకు సగటు వర్షపాతం నమోదు కాలేదు.దీనికితోడు వేసవిని తలపించేలా 40డిగ్రీలు దాటుతుండడంతోపాటుజలాశయాల్లో కనీసం నీరు చేరకపోవడంతో గిరిజన, ఉద్దాన ప్రాంతాలతో పాటు కిష్టుపురం, గరుడఖండిల్లో వరి ఎదలు ఎండిపోతున్నాయి.

చుక్కనీరు లేక..

టెక్కలిపట్నం నుంచి బడగాం వైపు ఉన్న గోపాలసాగరం ఆయకట్టులో కూడా ఏడాది దమ్ములు కాలేదు. టెక్కలి పట్నం-నవరపేట, రేగులపాడుల్లో, కమలాపురం, గోపివల్లభాపురంలోని మెట్ట భూముల్లో ఆకుమడులు సైతం ఎండిపోతున్నాయి. ఉద్దానం ప్రాంతంలోని ఏ ఒక్క చెరువుల్లో చుక్కనీరు లేకపోవడంతో నారు మడులను సైతం రైతులు విడిచిపెట్టారు. ఉద్దానంలో నీటి వసతులు ఉన్న ప్రాంతాల్లో అక్కడక్కడా దమ్ములు చేసినా తడులు కోసం అన్నదాతలు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా లొత్తూరు, దానగొర, సిరిపురం, నవరగోవిందపురం, గట్టూరు, కొఠారిం గితాళభద్ర వంటి ప్రాంతాల్లో రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సాగుపై ఆశలు వదిలేశారు. కొద్దిరోజులుగా మేఘాలు, గర్జనలే తప్ప వర్షం కురవడంలేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కరువు ఛాయలు అలముకున్నాయని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్‌లో సైతం పంటలు లేకపోవడంతో హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వలసలే శరణ్యమని చెబుతున్నారు.


మామిడిమెట్టుకు వెళ్లే రహదారిలో భూమి దున్ని వదిలివేసిన రైతులు


పాతపట్నం: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు


జలుమూరు (సారవకోట): మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి


నరసన్నపేట: కరగాంలో వాగ్వాదం చేస్తున్న నారాయణవలస గ్రామస్థులు

గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా పనిచేయాలి

● జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు

గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా పనిచేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు. అభివృద్ధి పనులు గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని గ్రామసభల్లో ఆమోదించి ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు.

●పాతపట్నం : వైసీపీ ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించకుండా పంచాయతీలకు విడుదలైన నిధులు ఒక పైసా కూడా అభివృద్ధికి ఖర్చు చేయకుండా పక్కదారి పట్టించిందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆరోపించారు. పాతపట్నం, పాగువాడ, గంగువాడ గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు.

● జలుమూరు (సారవకోట): బుడితి గ్రామాన్ని దత్తత తీసుకొని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. బుడితిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభలో వచ్చిన సమస్యలు గుర్తించి శతశాతం పరిష్కరించి సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ఎంపీటీసీ మురళి, సర్పంచ్ శంకరరావు పాల్గొన్నారు.

కరగాం గ్రామసభలో వివాదం

నరసన్నపేట: కరగాం పంచాయతీ కార్యాలయం శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. పంచాయతీ పరిధిలోగల నారాయణవలసలో పనులు గుర్తింపులో ఆ గ్రామానికి చెందిన వారు తాము చెప్పిన రోడ్డు ముందుగా వేయాలని సభలో కేకలు పెట్టుకున్నారు. దీంతో కార్యదర్శి జోక్యం చేసుకొని ఇద్దరు చెప్పిన పనులు గుర్తించామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

బ్రాహ్మణతర్లాలో వాగ్వాదం

పలాసరూరల్:బ్రాహ్మణతర్లాపంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో టీడీపీ గ్రామ కార్యదర్శి వడ్డి యాదగిరి సర్పంచ్ బి.పుష్ప, గ్రామ సెక్రటరీ లక్ష్మణరేఖను పంచాయతీకి సంబంధించిన మినిట్స్‌బుక్, క్యాష్‌బుక్ వివరాలపై అడగ్గా, వారు ఆడిట్‌కు పంపించామని తెలియజేయడంతో గ్రామసభలో వాగ్వాదం జరిగింది.ఈవిషయంపై పేపరు మీద రాసిస్తారా, గ్రామస్థుల మధ్య ఈ విషయం ఒప్పుకుంటారా అని సర్పంచ్‌ను, పంచాయతీ కార్యదర్శిని యాదగిరి ప్రశ్నించారు. కాగా ఆడిట్‌కు పంపించామని, త్వరలో ఇస్తామని వారు తెలిపారు.

ఎస్టీ కమిషన్ సమావేశానికి కలెక్టర్ హాజరు

టెక్కలి: మండలంలోని లింగాలవలస పంచాయతీ సన్యాసిపేటలో 31 మంది గిరిజన రైతులు సాగుచేస్తున్న 22ఎకరాల85సెంట్ల కౌలుభూమి వ్యవహారంపై శుక్రవారం న్యూఢిల్లీలోని నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ సమావేశానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం హాజరయ్యారు. సన్యాసిపేట గిరిజనులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదుచేసిన విషయం విదితమే. అలాగే సన్యాసిపేట గిరిజనులు చిన్నారావు, నాగేశ్వరరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగిలు ఎన్‌సీఎస్టీ సభ్యులు జ్యోత్ హుస్సేన్ ఎదుటకు హాజరై వారి వాదనలను వినిపించారు.

బ్రాహ్మణతర్లాలో అంతరిక్ష దినోత్సవం

పలాస రూరల్: మండలంలోని బ్రాహ్మణతర్లా ఉన్నతపాఠశాలలో శుక్రవారం జాతీయఅంతరిక్ష దినోత్సవం నిర్వహించారు.పాఠశాల ఆవరణలో ఉన్న చంద్రయాన్-3 ల్యాండర్ పెయింటింగ్ వద్ద జాతీయజెండాలతో జైవిజ్ఞాన్ అని విద్యార్థులు నినాదాలుచేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

●టెక్కలి: అంతరిక్షంలో దేశానికి ఓ ప్రత్యేక స్థానం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో నేషనల్ స్పేస్‌డే పురస్కరించుకుని మాట్లాడారు. కార్యక్రమంలో ఐక్యూ కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, అధ్యాపకులు రాంబాబు, రమణమూర్తి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి: డీపీవో

పోలాకి: గతంలో మంజూరైన ఇళ్లనిర్మాణాలు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఈవో, డీపీవో ఆర్.వెంకటరామన్ ఆదేశించారు. శుక్రవారం పోలాకిలో హౌసింగ్, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామసభల ప్రత్యేకాధికారులతో సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఉషశ్రీ, ఈవోపీఆర్డీ బి.పద్మావతి పాల్గొన్నారు. అనంతరం డీపీవో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బందితో సమీక్షించారు.

బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలి

హిరమండలం: బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలని కేస్ వర్కర్ కప్పిలి ప్రసన్నరాణి తెలిపారు. శుక్రవారం స్థానిక కేజీబీవీలో ఆడపిల్లలును రక్షిద్దాం-ఆడపిల్లలును చదివిద్దాం అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించండి


హరిపురంలో ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

హరిపురం: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మందస మండలంలోని హరిపురంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జి.ఉమారాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రభుత్వం స్పందించి కఠిన చట్టాలు అమలు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జలుమూరు (సారవకోట): బుడితి సబ్‌స్టేషన్ పరిధిలో గల అన్నిగ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా అధిక లోడు ఫీడర్లను విడగొట్టడానికి 33/11 బుడితి సబ్‌స్టేషన్‌లో గల అన్ని ఫీడర్లను షట్ డౌన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటలు వరకు బుడితి, అవలింగి, చీడిపూడి, బద్రి, గుమ్మపాడు, అక్కివలస, భైదలాపురం, కిన్నెరవాడ, తొగిరి, వడ్డినవలస, గోపాలపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థినికి అభినందన

హరిపురం:మందస మండలంలోని బాహాడపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థిని మామిడి రేణుక ప్రాచీన జానపదాలు- మానవుని జీవితం అన్న అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించింది. దీంతో పాఠశాలలో శుక్రవారం రేణుకను హెచ్ఎం అంబటి కృష్ణమూర్తి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీను, వసంతరావు పాల్గొన్నారు.

బద్రి కూర్మారావుకు సన్మానం

పలాసరూరల్:గిడుగు రామ్మూర్తి జానపద కళావేదిక అధ్యక్షుడు బద్రి కూర్మారావును ప్రపంచ జానపదాల దినోత్సవం పురస్కరించుకుని విశాఖలో రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర జానపద కళాజాతరలో సన్మానించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, సినీనటుడు బ్రహ్మానందం, మంత్రి కందుల దుర్గేష్‌ల ఆధ్వర్యంలో కూర్మారావు చేసిన కృషికి అభినందించారు.

చిట్టేవలసలో లేఅవుట్ పరిశీలన

కోటబొమ్మాళి: నిమ్మాడ, చిట్టేవలసకు సంబంధించిన చిట్టేవలస కొండ వద్దగల లేఅవుట్‌ను మండల ప్రత్యేకాధికారి ఆర్.గడ్డెమ్మ, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రారంభం కానీ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిట్టేవలస, నిమ్మాడ, గంగరాం. కురుడు-1, కురుడు-3, తర్లిపేట లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల ప్రణాళిక రూపొందించాలి

నరసన్నపేట: వచ్చేనెల తొమ్మిది నుంచి మండలస్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు ప్రణాళికలను రూపొందించాలని ఎంఈవో పి. దాలినాయుడు సూచించారు. శుక్రవారం నరసన్నపేటలో వివిధ పాఠశాలల పీఈటీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆనందరావు, లక్ష్మణరావు, జ్యోతిరాణి పాల్గొన్నారు.

72 గంటలు గడువు ఇస్తున్నా

● డ్రైనేజ్‌లకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి
● మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

టెక్కలి: 'ఈ మురుగునీరు మధ్యమీరు నాలుగురోజులు నివాసంఉంటే తెలుస్తుంది. ఈ కంపులో ప్రజలు ఎలా ఉంటున్నారో గుర్తించారా, పరిస్థితి అర్థం కాదా, ఇప్పటికైనా మేల్కొండి.' అని పంచాయతీ ఈవో మల్లేశ్వరరావుపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసహనం వ్యక్తంచేశారు. శుక్రవారం టెక్కలిలోని మండాపొలంకాలనీ, భవానీనగర్, అయ్యప్పనగర్, పట్టుమహాదేవి కోనేరుగట్టు, రాచబండ తదితర ప్రాంతాలను అధికారులతో కలిసి పర్యటించారు. కాలువలు లేక రోడ్లపై మురుగునీరు నిల్వలుచూసి అధికారులకు ప్రశ్నించారు. 72 గంటల సమయం ఇస్తున్నాను. మొత్తం మండాపొలం కాలనీలో అవసరమైన డ్రైనేజ్‌ల నిర్మాణానికిప్రతిపాదనలు సిద్ధంచేయాలని పంచాయతీరాజ్ ఈఈ ఎ.సూర్యప్రకాష్, మండల ఇంజినీరింగ్ అధికారి లక్ష్మనాయుడులకు ఆదేశించారు. ఈనిర్మాణాల్లో భాగంగా ఎక్కడ ఆక్రమణలుజరిగినా తొలగించాలని తహసీల్దార్ దిలీప్ చక్రవర్తికి ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన డ్రైనేజ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని, అవసరమైతే రోడ్లపై నిర్మించిన మెట్లు తొలగించాల్సి వస్తుందని మంత్రి తెలిపారు.మండాపొలంకాలనీలో రోడ్లకు మధ్యలో స్తంభాలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా ట్రాన్స్‌కో ఏఈ పి.ఈశ్వరరావుతో మాట్లాడి 24 గంటల్లో సమస్య పరిష్కరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. భవానీనగర్ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాష్‌కు వివరించారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం మండల టీడీపీ అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, మామిడి రాము, లాడి శ్రీనివాస్, కోళ్ల వసంత్, హనుమంతు రామకృష్ణ, మెండ దమయంతి, దల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


మండాపొలం కాలనీ వాసులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

అన్నక్యాంటీన్ స్థల పరిశీలన

పేదలకు పట్టెడన్నం పెడతామంటే వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుకుందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. టెక్కలి ఇందిరాగాంధీ కూడలిలో ఈనెల 26న ప్రారంభించనున్న అన్నక్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.కార్యక్రమంలో హరి, సుందరమ్మ, ప్రసాద్‌రెడ్డి, ప్రీతీష్, సువ్వారి రాజేశ్వరరావు, బాలకృష్ణ, బొడ్డేపల్లి లచ్చు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం: ఎస్పీ

పలాస:సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన పరిష్కార వేదికలో 15 ఫిర్యాదులు స్వీకరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసుశాఖల సహకారంతో సమస్యల పరిష్కారమవుతాయని,జిల్లాలో అనేక సమస్యలు రెవెన్యూశాఖతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. ప్రాంతీయ పోలీసుస్టేషన్‌లో న్యాయం జరగకపోతే తమకు ఫిర్యాదు చేయవచ్చని, దూర ప్రాంతాల నుంచి ఫిర్యాదులకు రాలేని వారు కాశీబుగ్గలో నిర్వహించే పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ డి.మోహనరావు, ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


పలాస: ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

వేధింపులపై ఎస్పీకి ఫిర్యాదు

కాశీబుగ్గ:కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్న బాలికకు ఓ విద్యార్థి లైంగికంగా వేధిస్తుండడంతో శుక్రవారం తల్లిదండ్రులు హెచ్ఎం చిన్నంనాయుడుకు సమస్యను వివరించారు. ఆ విద్యార్థిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేశారు. ఏదో ఒక రోజు సెలవురోజున విద్యార్థికి పిలిపించి మాట్లాడుతానని పేర్కొనడంతో బాలికల తల్లిదండ్రులు హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.ఇక్కడ హెచ్ఎం పట్టించుకోవడం లేదని, పిల్లలకు రక్షణ లేదని వాపోయారు.ఈ విషయంపై ఎంఈవోశ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి మహేశ్వరరెడ్డికి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

మెళియాపుట్టి: సరిహద్దు పోలీస్‌స్టేషన్‌లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మహేంద్రరెడ్డి తెలిపారు.శుక్రవారం మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ పరిశీలించారు. రాత్రి సమయంలో గస్తీ తిరగాలని కోరారు. ఒడిశా నుంచి అక్రమ మద్యంతో పాటు గంజాయి వచ్చే అవకాశం ఉండడంతో తనిఖీలు చేయాలన్నారు. ఆయనతో పాటు సీఐ నల్లిసాయి, ఎస్ఐ టి.రాజేష్ ఉన్నారు.

పాతపట్నం:పాతపట్నంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ ఎన్.సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

ఎల్.ఎన్.పేట: పూశాం ఉన్నత పాఠశాలలో 2023- 24లో పదో తరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులకు ఎస్.చిన్నలక్ష్మీనారాయణ, పార్వతమ్మల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు యడ్ల రమణమూర్తి ఆర్థిక సాయం అందజేశారు. రోహిత్‌కు ఐదు వేలు, పాలక నిర్మలకు మూడువేలు, కోవిలాపు కిరణ్‌కు రెండు వేల రూపాయలు నగదు, ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఐదుగురి గాను ఒక్కొక్కరికీ రూ. వెయ్యి పంపిణీచేశారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి

జయరాం (ఫైల్)

సోంపేట: గొల్లగండి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రెడ్డి జయరాం(34) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొత్రఖండ గ్రామానికి చెందిన జయరాం కొర్లాం గ్రామంలో నివాసం ఉంటూ గొల్లగండిలో విధులు నిర్వహిస్తున్నాడు. పొత్రఖండ గ్రామంలో జరిగిన వివాహ వేడుకలు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా సంధికొత్తూరు వద్ద స్పీడ్‌బ్రేకర్ వద్ద అదుపు తప్పి కిందపడి మృతిచెందాడు. బారువ ఎస్ఐ చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. జయరామ్‌కి తండ్రి రెడ్డి అప్పారావు ఉపాధ్యాయుడు కాగా తల్లి తులసమ్మ, ఒక సోదరుడు, ఒక సోదరి ఉన్నారు. జయరామ్‌కి ఏడాది కిందటే వివాహం కాగా భార్య గర్భవతి. అందిరితో కలివిడిగా ఉండే జయరాం అకాల మృతిపై స్నేహితులు, గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులో స్నానానికి దిగిన హోంగార్డు..

కాంతారావు (ఫైల్)

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల సాయుధ పోలీసు క్వార్టర్స్ వెనుక భాగాన ఉన్న మరిడమ్మ చెరువులో శుక్రవారం స్నానానికి దిగిన హోంగార్డు తాడివలస కాంతారావు(48) మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లింగాలపేటలో నివాసం ఉంటున్న కాంతారావు తోటి హోంగార్డులతో కలిసి ఉదయం మరిడమ్మ తల్లి ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు వెళ్లారు. పని పూర్తయిన తర్వాత కాంతారావు స్నానానికి దిగాడు. చెరువులో ఈదుకుంటూ మధ్య భాగానికి వెళ్లాడు. తిరిగి బయటకు రాలేక మునిగిపోతుండడంతో తోటి హోంగార్డులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వెంటనే కుటుంబ సభ్యులకు, అధికారులకు సమాచారం అందించారు. ఏఆర్ డీఎస్పీ శేషాద్రి, జేఆర్ పురం సీఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది, గజఈతగాళ్లను రప్పించి కాంతారావు ఆచూకీ కోసం గాలించారు. చివరికి శుక్రవారం సాయంత్రానికి మృతదేహాన్ని గుర్తించారు. కాగా కాంతారావుకు భార్య, కుమారుడు సత్యనారాయణ, కుమార్తె స్వాతి ఉన్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి

కంచిలి: స్థానిక జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిసా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన బికాష్ చంద్రబారిక్(35) మృతి చెందారు. స్థానికులు, కంచిలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రబారిక్ పర్లాకిమిడి నుంచి గోపాల్‌పూర్ సముద్రతీరానికి స్నేహితుడు హరికృష్ణ దాస్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. కంచిలి ఫ్లై ఓవర్ (కేసవయ్య దాబా సమీపంలో) వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇనుప రీలింగ్‌కు బలంగా ఢీకొన్నారు. ఇనుప రీలింగ్ తలకు తగలడంతో చంద్రబారిక్ అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం నడుపుతున్న హరికృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. చంద్రబారిక్ తండ్రి జయంత్ బారిక్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

నందిగాం: చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనాపురం గ్రామానికి చెందిన భద్రాచలం ముకుందరావు (75) గురువారం రాత్రి మద్యం మత్తులో నీళ్ల తాగబోయి గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గుర్తించిన భార్య ఆరుద్ర స్థానికుల సాయంతో టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ముకుందరావు మృతి చెందాడు. ఇద్దరు వివాహమైన కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని శుక్రవారం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఇసుక లారీలు సీజ్

ఆమదాలవలస: నాగావళి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లిమెట్ట గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో జిలకపాలెం గ్రామానికి చెందిన ఇసుక లోడ్ లారీతో పాటు ఖాళీగా ఉన్న లారీ, రెండు ట్రాక్టర్లు, ఒక ప్రొక్లెన్‌ను ఎస్ఐ కె.వెంకటేష్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

తీరప్రాంత గ్రామాల్లో అవగాహన కల్పించాలి

గార: సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కె.మత్స్యలేశం మెరైన్ స్టేషన్ సీఐ బి.ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల కదలికపై నిఘా ఉంచాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు వి.బాలకృష్ణ, కె.మహాలక్ష్మి, ఏఎస్‌లు, బి.జగన్మోహనరావు, వి.వైకుంటరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కులదూషణ కేసులో నలుగురికి జైలు

జి.సిగడాం: కులదూషణ కేసులో నలుగురికి జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీ నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ఫణికుమార్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు ఎస్ఐ వై.మదుసూధనరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. 2015 సంవత్సరంలో నిద్దాం గ్రామానికి చెందిన పొన్నాడ అప్పారావుకు పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తికి కొలతలు వేస్తుండగా అదే గ్రామానికి చెందిన గిరడ చిన్న ముకుందనాయుడు, గిరడ కృష్ణారావు, గిరడ రమేష్, గిరడ రాంబాబు కలిసి కులం పేరుతో దూషించటంతో పాటు దాడి చేశారంటూ అప్పారావు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ జి.భాస్కరరావు కేసు నమోదు చేశారు. ఉమ్మడి జిల్లా పాలకొండ డీఎస్పీ ఆదినారాయణ దర్యాప్తు చేసి కోర్టుకు నివేదించారు. వాదోపవాదనలు విన్న న్యాయాధికారి ఈ నలుగురికి ఆరు నెలలు సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున్న జరిమానా చెల్లించారు. కాగా ఏ-2గా ఉన్న గిరడ కృష్ణారావు 2018లో మృతి చెందాడు. మిగతా ఏ-1, ఏ-3, ఏ-4లకు శిక్ష విధించారు. ఫిర్యాదు దారు అప్పారావు తరుపున మెట్ట మల్లేశ్వరరావు వాదించారు.

బావి వివాదంలో పంచాయతీకి అనుకూలంగా తీర్పు

పొందూరు: మండల కేంద్రం వెంకటేశ్వర కాలనీలోని ఓ బావి, స్థలం వివాదంలో పంచాయతీకి అనుకూలంగా పొందూరు కోర్టు తీర్పు చెప్పినట్టు ఈవో ఎస్.రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేఖరులతో మాట్లాడారు. 2016 ఆగస్టు 15న అదే కాలనీకి చెందిన వావిలపల్లి సుజాత.. పంచాయతీ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు ఆ స్థలంలో ఉన్న బావిని కొంతమంది సాయంతో పూడ్చి వేయించారు. దీంతో కాలనీవాసుల ఫిర్యాదు మేరకు పంచాయతీ సిబ్బంది ఆక్రమణను అడ్డుకున్నారు. దీనిపై ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై వాదోపవాదనలు జరిగాయి. చిరికి ఆ స్థలం పంచాయతీకి చెందినదిగా గుర్తించిన న్యాయాధికారి పంచాయతీకి అనుకూలంగా శుక్రవారం తీర్పు ఇచ్చారు. కోర్టు ఖర్చులతో పాటు అప్పటి పంచాయతీ ఈవోకు రూ.3 వేలు చెల్లించాలని సుజాతను న్యాయాధికారి బి.జోత్స్న ఆదేశించారు. కాగా ఇదే కేసులో కాలనీకి చెందిన కొంతమందిపై సుజాత వేసిన కేసులను న్యాయాధికారి కొట్టివేసినట్టు ఈవో తెలిపారు. పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్ తెలిపారు. ఈ తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

రణస్థలం: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మ కంపెనీ యాజమాన్యంపై వెంకటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. 18 మంది కార్మికుల బలికావడానికి, మరో 45 మంది కార్మికులు తీవ్రంగా గాయపడడానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని అన్నారు. ఈ మేరకు శుక్రవారం పైడిభీమవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు హడావిడి చేయడం తర్వాత పరిశ్రమల భద్రత గాలికొదిలేయడం పరిపాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

● **ఎచ్చెర్ల:** అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంపై న్యాయ విచారణ జరిపి, యాజమాన్యాన్ని వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో శుక్రవారం నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాశిరకం, కాలం చెల్లిన రియాక్టర్లు, పైపుల వినియోగం చాలా పరిశ్రమల్లో కన్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు టి.రామారావు, జి.శ్రీనివాసరావు, బి.రాము, ఎస్.నాగేశ్వరరావు, టి.రవి, రమణ, రామప్పుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్



పొందూరు: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నగేష్



కవిటి: సభలో పాల్గొన్న అధికారులు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్

● జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు

రణస్థలం: గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. శుక్రవారం వేల్పురాయి గ్రామంలో జరిగిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక సంవత్సంలో ప్రతి కుటుంబానికి 100 రోజులు పనికల్పిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలి శ్రీను, ఏపీడీవో లోకేష్, ఏపీఎం శ్రీనివాస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **గార:** అంపోలులో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీపీ గొండు రఘురామ్, తహసీల్దార్, ఎస్.రమణారావు, సర్పంచ్ జయరాం, ఏపీవో సంధ్యారాణి, మాజీ జడ్పీటీసీ గొండు వెంకటరమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించటమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని పంచాతీల్లో గ్రామసభలు విజ యవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. మండప ల్లి మేజర్ పంచాయతీలో సర్పంచ్ మామయ్య అధ్య క్షతన గ్రామసభ జరిగింది. చంద్రశేఖర్, నారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● **కంచిలి:** మండలంలో అన్ని పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు ప్రశాం తంగా జరిగాయని ఎంపీడీవో తెలిపా రు. ఉపాధి నిధులు ద్వారా 159 సీసీ రోడ్లు, 44 సీసీ డ్రైన్లు, మంజూరుకు ప్రతిపాదించినట్టు తెలిపారు.

● **కవిటి:** మండలంలో గల 23 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనులు గుర్తించారు. కవిటి మేజర్ పంచాయతీలో జరిగిన గ్రామసభను ప్రత్యేకాదికారి వైవీఎం రెడ్డి (డీడీ సోషల్ వెల్ఫేర్) పరిశీలించారు. సర్పంచ్ పిలక్ష్మణరావు, టీడీపీ నాయకులు మదు, రమేష్, అదికారులు రామచంద్ర, వీరబద్రస్వామి పాల్గొన్నారు.

● **పొందూరు:** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మండలప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ బి.నగేష్ అన్నారు. మండల కేంద్రంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు చినరంగ, ఎంపీటీసీలు బాడాన గిరి అదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని 29 పంచాయతీల్లో గ్రామసభలు విజయవంతంగా నిర్వహించినట్టు అధికారులు తెలిపారు.

సర్పంచ్‌లకు అవకాశం ఇవ్వాలి

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో సర్పంచ్‌లకు అవకాశం ఇవ్వాలని తొగరాం పంచాయతీ సర్పంచ్ తమ్మినేని వాణి సీతారాం అన్నారు. తొగరాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు సర్పంచ్‌గా తనను పిలవకపోవడం దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయం ఎదుట ఆమె నిరసన తెలిపారు. తక్షణమే కలెక్టర్ స్పందించి గ్రామసభ సర్పంచ్‌లను భాగస్వామ్యం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్ తదితరులు పాల్గొన్నారు.

దవళపేటలో అధికారుల నిలదీత

జి.సిగడాం: దవళపేటలో శుక్రవారం జరిగిన గ్రామసభ రెండు చోట్ల నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. తొలుత పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్టు గ్రామంలో దండోరా వేయించి.. తీరా రచ్చబండ వద్ద ఏర్పాటు చేయడంపై సర్పంచ్, ఉప సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, శ్రీనివాసరావులతో పాటు పేడాడ శ్రీరామూర్తి, పేడాడ జనార్ధనరావు అధికారులను నిలదీశారు. ప్రొటోకాల్ పాటించకపోవడంపై మండిపడ్డారు. ఈ విషయమై కలెక్టర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తమను అగౌరవపరచిన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రత్యేకాధికారి అరసాడ రవి వద్ద నిరసన తెలిపారు. అలాగే వాండ్రంగిలో జరిగిన గ్రామ సభలో మధ్యలోనే వదిలేసిన వాటర్ ట్యాంక్ పనులు పునఃప్రారంభించాలని గ్రామస్థులు అధికారులను కోరారు. కార్యక్రమం లో సర్పంచ్ సాకేటి నాగరాజు, మాజీ సర్పంచ్ బూరాడ వెంకటరమణ, గ్రామ పెద్దలు డబ్బాడ రామారావు, శనపల త్రినాథరావు, బొట్ట భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: అధికారులను నిలదీస్తున్న సర్పంచ్, నాయకులు

పరిశోధనలపై ఆసక్తి కలిగించాలి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి కలిగించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా కె.మత్స్యలేశ పరిధిలో ఉన్న లైట్‌హౌస్ అధికారులు స్థానిక పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ఎమెల్యే బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు, లైట్‌హౌస్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సూర శ్రీనివాసరావు జన్మదినం



పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం



అంబేడ్కర్ విగ్రహం వద్ద..

అరవసల్లి: ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత, ప్రముఖ సామాజిక, పారిశ్రామికవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం నగరంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బెహరా మనోవికాస కేంద్రంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. తోటపాలెంలోని యుత్ ఆధ్వర్యంలో స్థానిక అంబెద్కర్ భవనంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. నగరంలోని ఏడురోడ్ల జంక్షన్, డే అండ్ నైట్ కూడలి తదితర ప్రాంతాల్లో వందలాది మంది ఆటో డ్రైవర్లకు దుస్తులను పంపిణీ చేశారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని తన భవనం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. హయాతినగరం రెల్లివీధి యువత భారీ కేక్‌ను కట్ చేసి శ్రీనివాసరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

అరసవల్లి: రక్తదానం చేయండి - ప్రాణదాతలు కావాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎంవీ తిలక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని బ్యాంకు రీజనల్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ జగన్మోహనరావు, పెంకి చైతన్యకుమార్, బ్యాంకు డిప్యూటీ రిజర్వ్ హెడ్ పి.రవి, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై అప్రమత్తంగా ఉండాలి

ఎచ్చెర్ల: విద్యార్థినులు స్వీయరక్షణపై అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ బి.రేవతి అన్నారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో విద్యార్థినుల రక్షణ-ఆరోగ్యం అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విపత్కర పరిస్థితుల్లోనైనా విద్యార్థినులు ధైర్యంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జిల్లా రీసోర్స్ పర్సన్ హెచ్.నాగభూషణరావు, ప్రిన్సిపాల్ జి.గోవిందనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా జానపద ఉత్సవాలు

ఇచ్ఛాపురం: ప్రపంచ జానపద కళల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర డ్యాన్స్ అకాడమీ, మహంతి సాంస్కృతిక కళా సేవా సంస్థ టి.బరంపురం సంయుక్తంగా జగన్నాథస్వామి ఆలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు బృందాల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు కళాకారులను సత్కరించారు. చిన్నాగురుస్వామి, తిప్పన దనుంజయరెడ్డి తదితర కళాకారులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో పతకాల పంట



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: జాతీయ తైక్వాండ్ ఓపెన్ పోటీల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన 21 విద్యార్థులు పతకాలు సాధించడంతోపాటు తృతీయ స్థానంలో నిలబడి ట్రోఫీ అందుకున్నారు. ఈ నెల 16నుంచి 18వ తేదీ వరకు మూన్ సన్ కప్ ఓపెన్ నేషనల్ తైక్వాండో పోటీలు కలకత్తాలోని ఇచ్ఛాపూర్ రైఫిల్ ఫ్యాక్టరీ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. సంతపేట కోచింగ్ కేంద్రం వద్ద శుక్రువారం చీఫ్ కోచ్ చెన్నూరి దుర్గాప్రసాద్, కోచ్ భువనేశ్వరి ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పిలక విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ కాళ్ల దిలీప్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు ట్రోఫీలను అందజేసి అభినందించారు. ఈ చాంపియన్ షిప్ పోటీలు గత శుక్రవారం నుంచి మూడు రోజులు పాటు కలకత్తా లో పోటీలు జరిగాయి.

సెప్టెంబరులో రెవెన్యూ సదస్సులు

ఎల్ఎన్ పేట: గ్రామాల్లో రైతుల భూముల సమస్యలు పరిష్కరించేందుకు సెప్టెంబరులో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు టెక్కలి ఆర్డీవో సుదర్శన్ దొర తెలిపారు. శుక్రవారం చింతలబడవంజలో పెట్రోల్‌బంకు, రావిచెంద్రి జంక్షన్ సమీపంలో రైస్‌మిల్లు నిర్మాణానికి దరఖాస్తుచేసుకోగా ఆ భూములను పరిశీలించారు. ఆయన వెంట డీటీ రషీద్‌అహమ్మద్, ఆర్ఎస్ గవరయ్య, మండల సర్వేయరు ఆర్. గవరయ్య ఉన్నారు.

ఇంకా వైసీపీపై అభిమానం పోనట్టుంది!



రణస్థలం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం గోడలపై ఉన్న బోర్డు ఇది. వైసీపీ ప్రభుత్వంలో 'మా నమ్మకం నువ్వే జగన్.. మళ్లీ నువ్వే రావాలి' అన్న నినాదాలను హోరెత్తించారు. అక్కడా ఇక్కడా అన్న తేడా లేకుండా గోడలపై నింపేశారు. కానీ సాక్షాత్ ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని గోడలపై కూడా వేశారు. అయితే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ ఈ గోడలపై మాత్రం నాటి రాతలు చెరపలేదు. దీనిపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

డీజేలు నిషేధించాలి

సోంపేట: వినాయక చవితి, దసరా వంటి వివాహ కార్యక్రమాల్లో ఏర్పాటు చేస్తున్న డీజేల సౌండ్స్‌తో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, వీటిని తక్షణమే నిషేధించాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ ఎస్పీని కోరారు. ఈ మేరకు శుక్రవారం పలాసలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఊరేగింపుల్లో ఉపయోగించే డీజే కారణంగా గర్భిణులు, బాలింతలు, హృద్రోగులు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని జాగృతిసంస్థ వ్యవస్థాప అధ్యక్షుడు రాంబుడి గణపతి ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎచ్చెర్ల: ధర్మవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, ఇతర మరమ్మతుల కోసం ఈ నెల 24న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బయ్యన్నాయుడు తెలిపారు. డి.మత్స్యలేశం, ఓఏ అగ్రహారం, భగీరథపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఇచ్ఛాపురం: షాపులు నిర్వహిస్తున్న ప్రతీ వ్యాపారి షాపుల్లో సీసీ కెమారాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. కొనుగోలు దారుడు వాహనాలు అడ్డుపెట్టినా షాపు యజమానే బాధ్యత వహించాలి. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే షాపు యజమానిపై చర్యలు తప్పవన్నారు. రద్దీలేని సమయంలోనే లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలను చేయాలని అన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఆమదాలవలస: గాజుల కొల్లివలస గ్రామ సమీపంలో, ఆముదాలవలస మున్సిపాలిటీ పరిధిలో గల పేదలకు కేటాయించి గతంలో జగనన్న కాలనీలో(రాష్ట్ర పట్టణ ప్రాంత గృహ నిర్మాణ సంస్థ) ఇల్లు నిర్మాణాలు వేగవంతం చేయాలని డ్వామా ఏపీడీ పంచాది రాధ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోలనీలో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని, ఎందువలన నిర్మాణాలు నిలిచిపోయాయో అనే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మోహనరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇళ్లను పరిశీలిస్తున్న ఏపీడీ రాధ



శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి



కలెక్టరేట్: కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న డీఆర్వో అప్పారావు



డీఆర్డీఏ కార్యాలయంలో పీడీ కిరణ్‌కుమార్..

టంగుటూరికి ఘన నివాళి

రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్, కళాశాలల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు గుర్తుచేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



నరసన్నపేట: పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పలాస: మునిసిపల్ కార్యాలయంలో...



టెక్కలి: కొత్తగ్రంథాలయంలో..



జలుమూరు (సారవకోట): సారవకోట ఎంపీడీవో కార్యాలయంలో...



శ్రీకాకుళం కల్చరల్: స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో..